పోతోంది. వెనకాల చీకట్లో ఎక్కడా మనుష్యసంచారంలేని నట్టడివిలో నడిరోడ్డుమీద త్రాగిన మొగుడు చేతిలో దెబ్బలుతింటూ వాడు ఏమైపోతాడోనని భయంతో, వాడికోసం దిగబడిపోయిన సూరిమీద నా కంతులేని జాలి ముంచుకు వచ్చింది. మొగుడు వద్దు అని కొట్టున్నా వాడినే అంటిపెట్టుకుని వాడి చేతులో దెబ్బలు తింటున్న సూరిలాటి పల్లెటూరి స్త్రీలను నేను ఎప్పటికీ మర్చిపోలేను.

నా దృష్టి అమ్మలుమీద పడింది. చదువుకుని ప్రేమించి పెండ్లాడిన అమ్మలుకు, చదువుకోని పల్లెటూరి సూరికి ఎంత తేడా !

అమ్మలుకూతురు చిట్టి, “అమ్మా.! నాన్నారే–నాకు నాన్నారుకావాలే–” అని వెక్కి వెక్కి ఏడుస్తోంది. ఆ పసిదాన్ని మంచిమాటలతో సముదాయించటంపోయి దాన్ని కొడుతోంది అమ్మలు. బస్సులోనివాళ్ళంతా కూతురును వూరికే బాదుతున్న అమ్మలు వంక చూస్తున్నారు. “రామ్మ, చిట్టీ–” అని నేను చిట్టిని నా వళ్ళోకి తీసుకున్నాను.

గతుకుల రోడ్డుమీద బస్సు ఎగిరెగిరి పడుతోంది. అలాటి రోడ్డుమీద అంత అర్జంటుగా, అంత స్పీడుగా బస్సునడపాల్సినంత కొంప ముంచుకు పోయే పనులు ఆ డ్రైవరుకు ఏం ఉన్నాయో ! ఇంజను పెద్ద రొదచేస్తోంది.. బ్రేకులు కర్ మంటున్నాయి. బస్సు రోడ్డును తప్పి తుప్పల్లో పడిపోతోంది. లోపలి జనమంతా గొడవ. గభీమని ఒకచెట్టుకు గుద్దుకుని ఆగిపోయింది. బస్సులో లైట్లు ఆరిపోయాయి. ఇంకానయం. బస్సు పల్టీకొట్టి వున్నట్లయితే అంతా చచ్చి వూరుకునేవాళ్ళం. కాస్తంతలో ప్రమాదం తప్పిపోయింది.

“త్రాగుబోతు వాళ్ళంతా డ్రైవర్లయితే ఇంతే–” అని కండక్టరు చిరాకుగా సీటులోంచి లేచి, ఆ డ్రైవర్ని తిడుతూ కిందకుదిగాడు.

□□□








# ఆడ కథ



“ఈ జన్మలోనేకాదు. వచ్చే జన్మలోకూడా నీ మేలు మర్చిపోలేనురా” అంటూ అవలీలగా నా దగ్గర ఐదురూపాయలు అప్పు తీసుకొని సినిమాకి వెళ్ళబోతూన్న మూర్తి అపళంగా ఆగి—

—మళ్ళీ నన్ను అభినందించే వరసలో “ఒరేయ్! నీ ఋణం ఎలా తీర్చుకోవాలో తెలియడంలేదు. కనీసం నువ్వు అమ్మాయివైనా అయితే కట్నంలేకుండా నిన్ను పెళ్ళిచేసుకుని వుండేవాడిని” అని అర్జంటుగా వెళ్ళిపోయాడు.

“ఏడిశాడు వెధవ. నేను నిజంగా అమ్మాయి నైతేమాత్రం వీడు నన్ను యీ ఐదు రూపాయల అప్పుతో సరిపెట్టుకుని వేరే కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటాడా ?” అని నేను స్వగతంలో పైకి ఆలోచించాను.

వాడి కసలు ప్రేమించడమే రాదు. ఇంక పెళ్ళి చేసుకుంటాడా కట్నం లేకుండా ? చిన్నప్పటినుంచి ఒకే కంచం, ఒకే మంచంతో సరిపెట్టుకుంటూ

'తంబు'

వస్తున్నాం మే మిద్దరం. నేను ఎన్నో సార్లు చెప్పాను వాడికి "అబ్బాయీ! చూడు. నేను ఎంచక్కా పద్మని ప్రేమిస్తున్నాను. అలాగే నువ్వు కూడా ఎవరినైనా ప్రేమించరా" అని. వాడు నా మాట వింటేకదా! అబ్బే! వింటే ఎప్పుడో బాగుపడి వుండే వాడు. ఇంతమంది అమ్మాయిలంద రిలో ఏ ఒక్కరిని ప్రేమించలేనివాడు నేను అమ్మాయినయితే నన్నుమాత్రం ప్రేమిస్తాడని గ్యారంటీ ఏమిటి? వాడు ప్రేమించడు. పెళ్ళిచేసుకోడు. (అందులోనూ కట్నం లేకుండా!) అని కాస్సేపు ఆలోచించాక "ఏమో యింతవరకూ ఏ అమ్మాయిని చూసినా వాడిహృదయం స్పందించ లేదేమో. నేనమ్మాయినైతే అమాంతం వాడు నాకు దాసుడౌ తాడేమో" అని ఒక అనుమానం వచ్చింది నాకు. నేనమ్మాయినైతే— వాడేకాకుండా ఇంకా చాలామంది అబ్బాయిలు నాకోసం పోటీపడి దెబ్బలాడుకుంటారనిపించింది. కొంచెం సిగ్గేసిందికూడా!

ఏమైనా ఒక్కసారి అమ్మాయి నైతే, ఎవరేం చేస్తారో, నేనేం చేస్తానో చూడాలనిపించింది. కాని అది సాధ్యమా?

పుట్టకముందే మనల్ని అబ్బాయిలని, అమ్మాయిలనీ రెండు తెగలుగా దేవుడు విభజించాడు. శారీరకంగానూ మానసికంగానూ బోలెడు భేదాలు కల్పించాడు. నేను ఈ పళంగా అమ్మాయి నవాలంటే నా జీవకణాల్లోవుండే 'క్రోమోజోమ్సు' కూడా మారాలి. అదెలా సాధ్యం? దేవుడు ఇంత కట్టుదిట్టంగా ఏర్పరిచిన ఈ అడ్డుగోడల్ని ఎలా దాటడం? ఈ సైన్సు కంటే దేవుడే గొప్పవాడు. అందుకనే నేను అమ్మాయి నవాలంటే సైన్సుని పట్టుకొని వేళ్ళాడేకంటే "దేవుడికీ జై!" అని ఆ దేవుడినే ప్రార్థించడం మంచిదనిపించింది.

కళ్ళు మూసుకుని తదేక ధ్యానంతో "ఓ దేవుడుగారూ! నన్ను కనీసం ఒక్కరోజుకి అమ్మాయిగా మార్చేయండి" అని వినయపూర్వకంగా ప్రార్థించడం మొదలుపెట్టాను.

ఇంతలో వెయ్యి మెరుపులు మెరసినంత కాంతి, వెయ్యి వయొలిను వాయించినంత నేపథ్య సంగీతంతో ఎవరో దేవలోకపు వ్యక్తి ప్రత్యక్షమయ్యాడు. అయితే— ఆయన దేవుడు అవునో, కాదో నాకు తెలియదు. అసలు దేవుడిని నేనింతవరకూ చూస్తేకదా మరి ఈయనే దేవుడని పోలిక పట్టడానికి.

ప్రశాంతంగా, చిర్నవ్వులు చిందుతూ చందమామలా వున్న వారి ముఖం, ఆకర్షణీయంగా, వెన్నముద్దలావున్న వారి శరీరచ్ఛాయ, ఆజానుబాహులైన వారి శరీరపుష్టి— అన్నీ కలిసి అదో రకమైన తేజస్సు వెదజల్లుతూ వుంది ఆ విగ్రహం. అంతేకాక దివ్యమయిన దైవవాసన కూడా వెయ్యడంతో ఈయన దేవుడు కాకపోయినా ఆయన దగ్గర చుట్టం అయివుంటాడనుకున్నాను.

భక్తితో నమస్కరించి "స్వామీ! తమరెవరు?" అని అడిగాను.

ఆయన వెన్నెల జల్లులాంటి ఒక మందహాసంచేసి "స్వామీ జీవశాస్త్రానంద అంటారు నన్ను" అన్నారు. కోటి కోయిలలు కలసి కోరస్ కూసినట్టున్న మధురమైన వారి కంఠ స్వరానికి నా చెవులు త్రుప్పురాలి తిమ్మిరెక్కాయి.

ఏం చెయ్యాలో తెలియక "ఏం కావాలి స్వామీ, మీకు" అనడిగాను, చెవులో తిరిపెట్టుకుంటూ. చిరుదగ్గు వచ్చింది. దగ్గాను.

"నీకేం కావాలి?" అని తిరిగి ప్రశ్నించారు స్వామీజీ. దానితో నేను స్పృహలోకి వచ్చి "స్వామీజీ నేను ఈ పళంగా అమ్మాయినయి పోదామనుకుంటున్నాను — తరుణోపాయం తమరు సెలవిస్తే..." అని నసిగాను.

ఆయన ముసిముసి నవ్వులు నవ్వుకుంటూ ఒక చిన్న భరిణెతీసి ఇచ్చి "దీన్ని హార్మోను లేహ్యము అందురు. ఇది తిన్న అబ్బాయిలు అమ్మాయిలుగానూ, అమ్మాయిలు అబ్బాయిలుగానూ మారిపోయెదరు. గుణము వెంటనే కన్పించును. గ్యారంటీ! పనిచేయాలి. చేయని యెడల భరిణె వాపస్ తీసుకొనబడును. ఇది దొరకుచోటు నేనే! ఆలసించిన ఆశాభంగము. తరుణము మించిన మరలరాదు. సరుకు కొద్దిగా మాత్రమే యున్నది. నేడే మీ భరిణె రిజర్వు చేయించుకొనుడు" అని మాయమయ్యారు.

వారు మాయమవగా మిగిలినఖాళీ జాగాకి నేను నమస్కరించి, ఆ భరిణెని కళ్ళకద్దుకుని, మూత తీసికొంచెం లేహ్యం రుచి చూశాను. అమృతంలా వుంది. కొంపతీసి స్వామీజీ హార్మోను లేహ్యమునకు బదులు అమృతము నివ్వలేదుకదా అని నాకు సందియము కల్గినది. ఏదైతేనేం తేరగా వచ్చిందని యింకొంచెం తిన్నాను. ఆ లేహ్యం తిన్నతరువాత నా ఆనందం కట్టలు తెంచుకొని పట్ట పగ్గాలు లేకుండా ప్రవహించింది. అమ్మాయినైపోతున్నందుకు కొంచెం గర్వంకూడా వచ్చింది.

అమ్మాయినైతే—ఎంచక్కా రంగు రంగుల చీరెలు కట్టుకోవచ్చు. దోసగింజలా చక్కగా తిలకంబొట్టు పెట్టుకోవచ్చు. పొట్టిగావున్న అమ్మాయికి మల్లే ఎత్తుమడమల జోళ్ళు వేసుకొని నాజూగ్గా నడవచ్చు. అప్పుడు పమిట సర్దుకుంటూ సొగసు నటించవచ్చు. అతీను లాకెట్ వున్న ఒంటిపేటగొలుసు మెళ్ళో వేసుకుని ఆ లాకెట్ నిమాత్రం పిప్పర్‌మెంట్ బిళ్ళలా చప్పరించవచ్చు. లంబాడీవాళ్ళలా బోలెడు గాజులు వేసుకోవచ్చు. కళ్ళుచిన్నవైనా కాటుక పొడుగ్గా పెట్టుకొని కళ్ళు పెద్దవిగా కన్పింప చేసుకోవచ్చు. శనివారంనాడు తలంటిపోసుకుని జుట్టు రెండు జడలుగా వేసుకుని ఒక జడలో మందార పువ్వు పెట్టుకొని మరో జడని

భుజాలమీదుగా కండువాలాగ ముందుకి వేసుకోవచ్చు. జుట్టు తక్కువయితే సవరం పెట్టుకుని జడ పొడుగ్గా వేసుకోవచ్చు. ఈ విధంగా అందంగా తయారయి, ఆనందంగా కాలేజీకి వచ్చి, మనకి ఇష్టంలేని అబ్బాయిని అతనేమీ అనకపోయినా "ఏయ్, మిష్టర్! జాగ్రత్త! పళ్ళు రాలగలవ్" అనేసి పైగా ప్రిన్సిపాల్‌తో రిపోర్టుకూడా చెయ్యొచ్చునోచ్— అని నేను వూహాగానంలో తేలిపోతూ—

అయిపోతాను ఎంచక్కా అమ్మాయినీ
అనుకుంటాను నేనే అందంగా
వుంటాననీ—
అయిపోతాను ఎంచక్కా అమ్మాయినీ
అంటాను అందరితో నేనే
చిన్నదానిననీ—
అయిపోతాను ఎంచక్కా అమ్మాయినీ
అనుకుంటా నేనంటే అందరూ
పడిచస్తారనీ—
అయిపోతాను ఎంచక్కా అమ్మాయినీ
చాటిస్తా కన్నీరే విజయానికి
సాధనమనీ—
అయిపోతాను ఎంచక్కా అమ్మాయినీ
దాసుడిగా చేసుకుంటా నచ్చిన
ఓ అబ్బాయినీ—

అని స్వంతవరసలో కట్టిన పాటలాంటి పదార్థాన్ని పాడుకుంటూ వుండగా ... ...

నా మీసం మాయమయ్యింది. నా గడ్డం అప్పుడే గీసుకున్నట్టునున్నగా అయిపోయింది. పొట్టిగా కొట్టించిన క్రాపింగ్ క్రమంగా కేశవర్ధని రాసుకున్నట్లు పెరిగి పెద్దదవడం ప్రారంభించింది. ఒళ్ళంతా అదోలా అన్పించి కితకితలు పెట్టినట్టయింది. నా శరీరంలో ఏదో గొప్ప విప్లవం జరుగుతున్నట్టు తోచింది. రానురాను నేను మెత్తగా, నున్నగా, గుండ్రంగా తయారయ్యాను.

నాకేదో అనుమానం వచ్చింది. నన్ను నేను నా చేతులతోనే తడిమి చూసుకున్నాను. నాకే సిగ్గేసింది. ఇంకేముంది? అమ్మాయి నైపోయాను.

ఏదో మైకంలోంచి కళ్ళు తెరిచి చూసినట్టు చుట్టూ కలియచూశాను. రూమ్‌నిండా హాలీవుడ్ స్టార్ల చిత్రాలు వేళ్ళాడుతున్నాయి. నాకెందుకో అవి చూడడానికే సిగ్గేసింది. అయినా ఎందుకో చూడాలనిపించింది. చూశాను. ఎందుకో మళ్ళీ "ఛీ" అనిపించింది.

అవును! సందేహంలేదు. నేను అమ్మాయి నైపోయాను, పూర్తిగా. లేకపోతే గంటలతరబడి ఆ బొమ్మలు చూసేవాడిని, నాకే "ఛీ" అన్పించడమేమిటి? ... ... అని కొంచెంసేపు ఆలోచించాక ఆ బొమ్మలన్నీ చించెయ్యాలని బుద్ధిపుట్టింది. "ఛీ! ఈ హాలీవుడ్ అమ్మాయిలకి సిగ్గులేదు" అనుకుంటూ ఆ బొమ్మలన్నీ శుభ్రంగా చించి పోగులుపెట్టాను.

అలా "అమ్మాయితనం" నాలో పూర్తిగా వ్యాపించాక నాకు రూమ్ అంతా మగవాసన వెయ్యనారంభించింది. ఇంతలో నా ప్యాంట్, షర్టు



వుస్సు స్టాండ్ నన్ను వెక్కిరించాయి. నా షేవింగ్ సెట్ నన్నుచూసి వెకిలి నవ్వు నవ్వింది. నే కట్టుకున్న గళ్ళ లుంగీ, గళ్ళచొక్కా నాకు ఎబ్బెట్టుగా అన్పించాయి. పోనీ బట్టలు మార్చుకుందామని రూమ్ అంతా కలియ చూశాను. అన్నీ మగవాళ్ళ దుస్తులే! రూమ్ ఎక్కడ చూసినా "మగత్వం" మూర్తీభవించినట్టు ఉంది. మా మూర్తిగాడి ఫోటో కన్పించింది ఎదురుగా. బొద్దింకల్లా వాడి మీసాలు నాడూను. నాకేసే సూటిగా సిగ్గులేకుండా అదోలా చూస్తున్నట్టుంది. నాకు చిరాకేసింది. సిగ్గేసింది భయమేసింది.

అమ్మో! ఇప్పుడు సినీమానించి మూర్తి తిరిగి వస్తాడుకదా! అరరాత్రి యీ రూమ్‌లో ఒక్కర్తినీ అందులోనూ అమ్మాయినీ వుంటే ఇంకేమైనా వుందా!

ఇంతలో అడుగుల చప్పుడు విన్పించింది. నేను ఎందుకైనా మంచిదని వరండాలోకి వెళ్ళి పారిపోవడానికి సిద్ధంగా నుంచున్నాను. దూరంగా వస్తున్న హాస్టల్ వాచ్‌మాన్ ప్రైకాస్రావ్ "ఎవరది" అనరచాడు. నా పైప్రాణాలు పైకే పోయాయి. అంతే! పరుగుప్రారంభించి వార్డెన్ గారిల్లు చేరుకుని తలుపులు దబదబాబాదేశాను.

వార్డెన్‌గారువచ్చి తలుపులు తీశారు. నేను తలుపులు తోసుకుని లోపలకు పరుగెట్టాను. నా వెనకాలే 'దొంగ' అంటూ వాచ్‌మాన్ ప్రైకాస్రావ్ పరిగెట్టుకొచ్చాడు. మా వార్డెన్‌గారికి అంతా అయోమయంగా తోచింది. లోపలి గదిలోకి వచ్చి గదంతా వెదికి బీరువా ప్రక్కనే దాక్కున్న నన్ను "ఇడుగో దొంగ!" అని జబ్బపట్టుకుని ఇవతలకి లాగారు.

చేతికి దొరికిందని నన్ను ఏమైనా అఘాయిత్యం చేస్తారేమోనని నా గుండె గుభేలుమంది. ఈ హడావిడికి అప్పుడే నిద్రలేచిన వాళ్ళావిడ అటు వచ్చింది. నేను గబుక్కున ఆవిడ వెనక్కి వెళ్ళి దాక్కున్నాను. ఆవిడ హడలిపోయి "బాబోయ్ వీడెవడండోయ్" అని ఎగిరి గంతేసి ఆయన్ని పబ్లిగ్గా నా ఎదుటా, మా వాచ్‌మాన్ ఎదుటా కౌగలించేసుకుంది.

దాంతో మా వార్డెన్ గారికి ఎక్కడలేని ధైర్యంవచ్చి "ఏమిటోయ్" ఇదంతా అని గర్జించి గట్టిగా నాభుజంమీద చెయ్యివేసి కోప్పడ్డారు. నాకు వళ్ళు మండింది. ఎంత వార్డెనైతే మాత్రం అమ్మాయినిగదా నా భుజంమీద చెయ్యివేయడం ఏమిటి? అందుకే "మేష్టారూ! మర్యాదగా నా భుజంమీద చెయ్యి తియ్యండి" అని కసిరాను. ఆయన నిర్ఘాంతపోయి చెయ్యి తీసేసి తెల్లమొహం వేశారు.

నేను అమ్మాయినైపోయిన విషయం అంతా పూసగుచ్చినట్టు చెప్పాను: నేను పూర్తిగా చెప్పేవరకూ ఆయన ముఖం అలాగే తెల్లగా వుండిపోయింది. ఆయన తేరుకున్నాక కాలేజి డాక్టర్‌గారికి ఫోన్ చేశారు నావిషయం.

పావుగంటలో కాలేజీ డాక్టర్ పోతురాజు గారు ఆవలించుకుంటూ

వచ్చారు. నేను ఆయనచేత పరీక్ష చేయించుకోడానికి వప్పుకోలేదు. అరగంట తర్వాత లేడీ డాక్టర్ కుమారిగారు వచ్చి నన్ను పరీక్షించి పూర్తిగా అమ్మాయినై పోయానని 'సర్టిఫికెట్' ఇచ్చారు.

అప్పుడు ఈసంగతంతా మా వార్డెన్ గారు ప్రిన్సిపాల్ కి ఫోన్ చేశారు. ఆయన నన్ను వెంటనే లేడీస్ హాస్టల్ కి పంపించెయ్యమని అన్నారు.

మా వార్డెన్ గారు నన్ను వెంటబెట్టుకొని లేడీస్ హాస్టల్ కి తీసుకువచ్చారు. లేడీస్ హాస్టల్లో మెంబర్నయ్యాను. పద్మకి నన్ను రూమ్ మేట్ గా వేశారు. పద్మ నన్ను చూడగానే నివ్వెర పోయింది. గ్లాసెడు మంచి నీళ్ళు తాగాక తేరుకొని "ఏమిటి మీరు..." అని ఆగిపోయింది.

"అవును నేను అమ్మాయినై పోయాను. ఇక మీదట నా పేరు శేఖర్ కాదు...... సురేఖ ...నీకు రూమ్ మేట్ ని" అన్నాను, గళ్ళ పైజమా, గళ్ళచొక్కాలో వున్న నేను.

పద్మకి ఏం చెయ్యాలో తోచ లేదు. పోర్షన్ మర్చిపోయిన నటిలా అలాగే వుండిపోయింది. నాకు మటుకు నిద్రవచ్చి ప్రక్కవేసుకొని హాయిగా అలాగే నిద్రపోయాను.

ఎప్పుడు తెల్లారిందో ఏమో హాస్టల్లో వున్న అమ్మాయిలంతా నా చుట్టూ చేరి నాకేసి వింతగా చూసి గుసగుస లాడుకుంటున్నారు. కళ్ళు తెరచి చూశాను. నిన్నటిదాకా తిన్నగా నాకేసి చూడ్డానికి భయపడిన అమ్మాయిలు ఈనాడు నాకేసి "నువ్వేం చేస్తావులే! అమ్మాయివై పోయావుగా" అన్నట్టు ధీమాగా చూశారు. కోరలు పీకిన తాచుపాముని చూసినట్టునన్నుచూసినవ్వారు. నామీద నాకే జాలివేసింది..

ఇంతలో పద్మవచ్చి వాళ్ళందర్ని పంపించేసింది. నేనుభయం భయంగా వెళ్ళి స్నానం గట్రాచేసి వచ్చాను.

పద్మ నాకేసి మొదటి సారిగా తిన్నగా చూసింది. వేదాంత ధోరణిలో చిన్న చిర్నవ్వు నవ్వింది. నేను తన్మయురాలినై పోయాను. అప్పుడు నాకు సిగరెట్టు కాల్చాలనిపించింది. అమ్మాయినై పోయాను కాబట్టి అతి కష్టంమీద ఆకోర్కె చంపుకున్నాను.

"ఇదిగో అమ్మాయ్! ఏమిటావేషం నువ్వూనూ! ఇలారా, ఈ బట్టలు కట్టుకో" అని చీర, జాకెట్టు మొదలైనవి ఇచ్చింది.

"ఇవి ఎలా కట్టుకోవాలి?" అన్నట్టు నేన్తు ముఖంపెట్టాను.

తనే స్వయంగా చీర కట్టి, సవరం పెట్టి, జడవేసి, కళ్ళకి కాటుక, నుదుట తిలకంపెట్టి బుగ్గలు సాగదీసింది.— 'ఎంత అందంగా వున్నావే!' అంటూ! నాకు సిగ్గుతో కల్తీ అయిన గర్వంవచ్చింది. అద్దంలో చూసుకున్నాను.



'అద్దంలో' అంది తర్వాత మాను కొందువుగా! అమ్మాయి అవగానే సరి పోలేదు. ముందుంది ముసళ్ళపండగ' అంది నన్ను హెచ్చరిస్తున్నట్టు.

"ఏమిటి?" అనడిగాను అమాయకంగా.

"అమ్మాయి అంటే ఏమిటో! అనుకుంటున్నావు. ఆడబ్రతుకు కత్తిమీద సాములాంటిది. గులాబీపువ్వు అందంగానే వుంటుంది. కాని తన ముళ్ళు తనకే గుచ్చుకొని రేకలు చిరిగిపోవచ్చు. అరటిఆకు ముల్లుమీద పడినా, ముల్లు అరటిఆకుమీదపడినా అరిటాకుకే నష్టం. అలాగే అమ్మాయి తన జాగ్రత్తలో తనుండకపోతే అధోగతిపాలే! అబ్బాయి నిన్ను చూడగానే ప్రేమించానంటాడు. పెళ్ళి అంటేమాత్రం పారిపోతాడు. ప్రేమతో ఆటలాడడం అబ్బాయిలకే చెల్లుతుంది. అమ్మాయిమటుకు ఒక గీత గీసుకొని తను ఆగీతదాటకుండా అబ్బాయిని ఆ గీతలోనికి రానీయకుండా వుంచాలి. లేకపోతే నువ్వెక్కడుంటావో? తెలిసిందా?" అని పద్మ తనకి వచ్చిన మాటల్లో తనకి తెలిసినది, నాకు తెలియవలసినంత తెలియ చెప్పింది.

కాస్సేపటికి పత్రికా విలేఖరులు, ఫొటో గ్రాఫర్లూ తయారయ్యారు. వాళ్ళేకాకుండా మా కాలేజీ అబ్బాయిలు కూడా గుంపులుగాచేరి హాస్టలు ముందు కాసుక్కూర్చున్నారు.

పేపర్ వాళ్ళు నా ఫొటోలు తీసుకొని, ప్రశ్నలడగడం ప్రారంభించారు.

"మీరెలా అమ్మాయి అయ్యారు? ఎందుకయ్యారు? ఎప్పుడయ్యారు?" మొదలైనవి అడగడం అయ్యాక నేను ఎలా అమ్మాయి నయ్యానో ఒకవ్యాసం రాసి వాళ్ళ పత్రికకి ఇస్తే చాలా డబ్బిస్తామన్నారు. తర్వాత కాలేజి కుర్రకారు వచ్చి నా ఆటోగ్రాఫ్ అడిగారు.

ఇంతలో కాలేజీకి టైమయింది. నేనూ, పద్మా, దిల్ షాద్, విజయలక్ష్మి, పార్వతి, జయశ్రీ కలసి కట్టకట్టుకుని జట్టుగా బోలెడు పుస్తకాలు మోసుకుంటూ కాలేజీకి బయల్దేరాం.

మా వెనకాలే స్థానిక రోమియో సంఘంవారు కూడా బయల్దేరి జోక్స్ వేస్తూ, వాళ్ళే నవ్వుకుంటూ, మమ్మల్ని నవ్వించడానికి ప్రయత్నాలు చేస్తూ, మా వాలుచూపుల కోసం విఫల ప్రయత్నాలు చేస్తూ మమ్మల్ని అనుసరించి జాగ్రత్తగా కాలేజీకి దిగబెట్టారు.

నేను కాలేజీలో అడుగు పెట్టగానే పెద్ద సంచలనం బయలుదేరింది. సినీమాతార వచ్చినట్టు, మంత్రిగారి రాకకంటే హడావిడి చేశారు.

బుఱ్ఱ వంచుకొని క్లాసులో ప్రవేశించి పద్మ ప్రక్కనే మొదటిబెంచీలో బుద్ధిగా కూర్చున్నా. సలీమ్ మాస్టారు పాఠం చెప్పకుండా అసలు ఆడవాళ్ళని ఎప్పుడూ చూడనట్టు ఆకలిగా నాకేసి చూడడం మొదలు పెట్టారు. నాకు

చిరాకువేసి పూర్వం నేను అబ్బాయిగా వుండేప్పుడు కూర్చునే చివరి బెంచీలకేసి చూశాను. ఆ బెంచీలో మూర్తి మొదలైన అబ్బాయిలంతా కన్నార్పకుండా నన్నే చూస్తున్నారు. నాకు నవ్వొచ్చింది. చిర్నవ్వు నవ్వుకున్నాను.

"ఆ చిర్నవ్వు నాది అంటే నాది అని ఆ అబ్బాయిలు దెబ్బలాడుకోడం ప్రారంభించారు. అప్పుడు మాస్టారు పాఠం చెప్పడం ప్రారంభించారు. ఏం చెబుతున్నారో ఎవరికీ తెలియడం లేదు. ఆయనకి అంతకంటే తెలియడం లేదు. నేను "అందరబ్బాయిలూ నాకేసే చూస్తున్నారా ? లేదా" అని అందర్నీ చూస్తున్నాను.

పద్మ నన్ను గిల్లింది. "ఏమిటి సిగ్గులేకుండా అబ్బాయిలకేసి అలా చూస్తావు ? పమిట సర్దుకుని సరిగ్గా కూర్చో" అని మందలించింది చల్లగా.

ఇంతలో క్లాసైపోయింది. ఇంకో లెక్చరర్‌వచ్చేలోగా ఎవరో అబ్బాయి ఓ కాగితంమీద "ఐ లవ్ యు" అని రాసి దాన్ని బాణంలా చేసి నా మీదికి గురిచూసి వేశాడు. నాకు ఒళ్ళు మండి గిరుక్కున వెనక్కి తిరిగి చూశాను. "అదే మారుని శరము అనుకొని నన్ను ప్రేమించవా ప్లీజ్!" అన్నట్టు ముఖం పెట్టాడు రంగనాథం. నేను కోపం పట్టలేక "యు బ్రూట్" అంటూ తారాజువ్వలా లేచాను. "ఒరేవ్వా! తారాజువ్వా!"అన్నాడు డేవిడ్ జాన్. ఈ లోగా లెక్చరర్ వచ్చి "ఏమి టిదంతా ?" అని అరిచాడు. "ఏమీ లేదు సార్... తారాజువ్వ!" అంకొక గొంతు వెనకనించి. అంతే! నాకు "తారాజువ్వ!" అని నామకరణం ఐపోయింది.

నాకు ఉడుకుమోత్తనం వచ్చి "వెధవలు" అని తిట్టుకున్నాను. "ఏం ? నాకు నువ్వు పేరు పెట్టినప్పుడు లేదా? పోన్లే. అబ్బాయిలు అమ్మాయిలైతే గాని అమ్మాయిల కష్టాలు తెలియవు" అందొకమ్మాయి కొంచెం కసిగా, మరికొంచెం జాలిగా.

ఐదునిమిషాలు పోయాక "ప్రపంచంలో అబ్బాయి అమ్మాయిగా మారడం అరుదు. ఐతే మన కాలేజీ అబ్బాయి అమ్మాయిగా మారి సదరు గౌరవాన్ని మన కాలేజీకి దక్కించినందుకు ఈరోజు సెలవుగా ప్రకటించడమైనది" అని ఇంగ్లీషులో నోటీసు వచ్చింది.

చాలామంది చప్పట్లుకొట్టి తమ సంతోషం తెలియచేశారు. కృతజ్ఞులైన విద్యార్థిలోకం "తారాజువ్వకీ జై!" అని కోడై "కొక్కొరో కో" అని కూసింది.

నేను స్త్రీ సహజమైన కన్నీటిని ఆపలేక చీరచెంగుతోతుడుచుకొంటూ ఇవతలికి వచ్చేశాను. కానీ, అక్కడ చాలామంది జనం వుండడంవల్ల నేను మునుపటిమల్లే అబ్బాయిని కాను కాబట్టి వాళ్ళని తోసుకుని వెళ్ళలేక అక్కడే నిలబడిపోయాను, మిగిలిన అమ్మాయిలతోసహా!

ఆ జనంమధ్యలో రాధాకృష్ణ, మురళీకృష్ణ దెబ్బలాడుకుంటున్నారు. తతిమ్మావాళ్ళంతా ప్రేక్షకులై చూస్తున్నారు.

"ఆ వశీకరణ ఉంగరం నాక్కావాలి. నేను సురేఖని ప్రేమించాలి"అన్నాడు మురళీకృష్ణ గట్టిగా.

"అదేం కుదరదు. మనిద్దరం చెరి సగం డబ్బువేసుకొని తెప్పించాం ఆ ఉంగరం. దానిమీద నీ కెంత హక్కు వుందో నాకూ అంత హక్కు వుంది" అన్నాడు రాధాకృష్ణ అంతకంటే గట్టిగా.

"అందుకనే ఇమ్మంటున్నా. మర్యాదగా ఇయ్యి" అన్నాడు ము. కృ. గట్టిగా.

"నేనివ్వక పోతే ఏం చేస్తావ్" అనరిచాడు రా. కృ. అంతకంటే గట్టిగా.

"ఆహా!" అని కోపంగా ఫెడీమని ము. కృ. ఒక్క లెంపకాయ కొట్టాడు.

వెంటనే రా. కృ. నీకూ నాకూ బాకీ లేదన్నట్టు 'ఫెడీ' అనికూడా అనకుండా 'చెళ్ళు'మని లెంపకాయ కొట్టాడు. ము. కృ. మరోటి వేశాడు. రా. కృ. నీది నువ్వేతీసుకో అన్నట్టు వెంటనే సమాధానం ఇచ్చేశాడు. ఈ దెబ్బలాటలో ఆవుంగరం ఎక్కడో పోయింది. "సరేలే నీసంగతిచూస్తా" అనుకుంటూ ఆరోజు వరకూ ఆప్త మిత్రులైన రా. కృ., ము. కృ. చెరొక దారిన వెళ్ళిపోయారు.

నా గురించి నామిత్రుల్లో అందులోనూ అన్నదమ్ముల్లాంటి రాధాకృష్ణ, మురళీకృష్ణలకి ఆ విధంగా దెబ్బలాట జరుగుతుందని నే నెన్నడూ అనుకోలేదు. నాకు ఎందుకో కళ్ళలో నీళ్ళు తిరిగాయి. హాస్టల్‌కిపోయి భోజనం చెయ్యకుండా ఏడుస్తూపడుకున్నాను.

సాయంకాలమైంది. నిద్ర లేచి ముఖం కడుక్కొని కాఫీతాగివచ్చి ఏమీ తోచక పద్మకేసి చూస్తూ కూర్చున్నాను.

"ఏమిటలా ఉన్నావ్" అడిగింది.

"మనసదోలా వుంది." అన్నాను.

నాకూ అలాగేవుంది" అంది పద్మ.

"అమ్మాయిగారూ" అంటూ

---

## రచయితలకు మనవి

"జ్యోతి"కి రచనలు పంపేవారు అవి నిరాకరింపబడిన పక్షంలో వాటిని త్రిప్పి పంపగోరితే రచనలతోపాటు తగినన్ని స్టాంపులను జతచేసి పంపించాలని మనవి. రచనతో పాటు కాక తరువాత స్టాంపులు పంపవద్దని, అట్టివారికి రచనలు త్రిప్పి పంపడం కష్టసాధ్యమని గుర్తించాలని కూడా మా విజ్ఞప్తి.

— మేనేజింగ్ ఎడిటర్.

హాస్టల్ ఫ్యూన్ "ఎంకట్రావ్" వచ్చాడు.

"ఏమిట్రా" అనడిగాను.

వాడొకకవరిచ్చి "కాలేజీఫ్యూన్ కొండలరావు తెచ్చాడండి" అన్నాడు.

ఏమిటో అని విప్పిచూశాను. సలీమ్ మేష్టారురాసిన ప్రేమలేఖ. 'ఛీ' అన్పించింది. ఆ కవరు వాడి ముఖాన విసిరి "ఇటువంటివి ఇంకెప్పుడైనా తెచ్చావంటే జాగ్రత్త!" అని అరిచాను.

వాడు ఆ కవరు అక్కడే వదిలేసి పారిపోయాడు.

"ఛీ! అమ్మాయంటే ఎందుకో అందరికీ ఇంత అలుసు" అన్పించింది.

ఇంతలో "ఎంకట్రావ్" బెదురుతూ మళ్ళీ వచ్చాడు. "ఎందుకు మళ్ళా వచ్చావ్" అని గర్జించాను.

"అదికాదండి. ఎవరో మూర్తి గారుట మిమ్మల్ని కలుసుకోవాలట" అని నీళ్ళు నమిలాడు.

"సరే" అని విజిటర్స్ రూంకి వచ్చాను. అక్కడ దిగాలుగా నాకోసం నిరీక్షిస్తూన్న మూర్తిని చూస్తే నాకు జాలివేసింది. నన్ను చూడగానే వాడి ముఖం చంద్రుడ్ని చూసిన చకోరంలా కళకళలాడింది.

"ఏమిటి మూర్తీ, ఇలా వచ్చావ్" అనడిగాను మర్యాదగా.

వాడు నాకు ఈరోజే వచ్చిన రేపటి న్యూస్‌పేపర్ ఇచ్చాడు. 'ప్రపంచంలో ఎనిమిదోవింత' అని నా గురించి వేశారు, నా బొమ్మతో సహా! నా జన్మలు తరించాయి. నాకు గర్వంతో కూడిన చిర్నవ్వు వచ్చింది.

"ఒరేయ్, సురేఖా! ఈ శుభ సందర్భంలో నిన్నొకటి అడగాలను కుంటున్నానురా" అన్నాడు మూర్తి,

"ఒరేయ్ అనకు మర్యాదగా మాట్లాడు" అని వాడ్ని హెచ్చరించాను.

వెంటనే "సారీ, మర్చిపోయా... ఇదిగో సురేఖా చూడు! చిన్నప్పట్నించీ మనిద్దరం కలిసి మెలిసి పెరిగాం. మనస్నేహం చిరస్థాయిగా నిలచిపోవాలంటే అది ప్రేమగా మారి పెళ్ళిగా రూపొందాలి. నిన్ను ప్రేమిస్తున్నాను సురేఖా! మనం పెళ్ళి చేసుకుందాం" అని గుక్కతిప్పకుండా ఆవేశంతో అన్నాడు మూర్తి.

నాకు అంతా అయోమయంగా తోచింది. అందుకే "చూడు మూర్తీ! నువ్వు నన్ను అపార్థంచేసుకొన్నావ్! నేను నిన్ను ఒక సోదరుడుగా చూశాను తప్పితే ఎప్పుడూ ఆ వుద్దేశంతో నిన్ను చూడలేదు. క్షమించు" అని యింక మాట్లాడలేక కన్నీరాపుకుంటూ అక్కణ్ణించి లేచి వచ్చేయబోయాను.

"వెళ్ళిపోయేముందు యీ మాట విని మరీవెళ్ళు సురేఖా! నువ్వు కాదన్ననాడు, నువ్వూ, నీ ప్రేమ లేని నాడు, నిన్నేకాదు యీ ప్రపంచాన్నే విడనాడి వెళ్ళిపోతాను" అని బావురుమన్నాడు మూర్తి బాధగా.

నేను అక్కడ నిలువలేక పరిగెట్టుకుంటూ వచ్చి పక్కమీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడవడం మొదలు పెట్టాను. అలా అరగంట ఏడిచేసరికి యింక ఓపికలేక నాకు ఏడుపు ఆగిపోయింది. ఐనా యింకా వెక్కిళ్ళు విన్పించసాగాయి. తీరా చూస్తే పద్మకూడా ఏడుస్తోంది.

నేను కళ్ళుతుడుచుకుని "ఎందుకు ఏడుస్తున్నావు?" అని అడిగాను.

దాంతో యింకా యెదయింది పద్మ. ఐనా అలాగే కష్టపడి ఏడుపుని ఆపుకుంటూ "ఎందుకేమిటి, నీముఖం. చూడు యివిగో నువ్వు అబ్బాయిగా వున్నప్పుడు నాకు రాసిన ప్రేమలేఖలు! నన్ను ప్రేమిస్తున్నానని, నన్నే పెళ్ళి చేసుకుంటానని రాశావుకదా! నిన్ను ప్రేమించి పెళ్ళిచేసుకుందామని నేను ఎన్నో ఆశాసౌధాలు కట్టుకున్నానే! అటువంటప్పుడు మరి నువ్వు చటుక్కన అమ్మాయివైపోతే నేను ఏడవక నురేం చెయ్యను" అని ఘొల్లుమంది పద్మ.

నాకు మతిపోయింది, పద్మనన్ను ప్రేమిస్తోందని తెలిస్తే నేను అబ్బాయిగానే వుండిపోదునే! ఎందుకు! ఎందుకు ఇలా అమ్మాయినయ్యాను. నేను అమ్మాయినైనందుకు పర్యవసానాలు. నాస్నేహితుల్లో దెబ్బలాటలు. సలీమ్ మేష్టారి ప్రేమలేఖలు, మూర్తిగాడి నిరాశ నిస్పృహలు— అన్నిటినీ మించిన పద్మ ప్రణయసౌధాల శిథిలాలు!!... ...

"ఏమిటి భగవాన్, ఈ కష్టాలు? నన్ను మళ్ళీ అబ్బాయిని చేసేయ్" అని నేను బాధపడుతుండగా నాకు లేహ్యండబ్బీ మాట జ్ఞాపకంవచ్చి వెదకడం మొదలుపెట్టాను.

"ఏమిటండీ అలాపర్సు పారేసుకున్నట్టు ఇల్లంతా వెతుకుతున్నారు" అని మా శ్రీమతి పద్మ నన్నునిద్రలేపి—

"మనకి పెళ్లి అవకముందు కనవలసినకల యిప్పుడు కన్నారేమిటి కొంపదీసి" అనడిగింది.

□□□



